# మరిగింపు

## కె.గోపాలరావు

యూనివర్సిటీనుంచి అప్పుడే తిరిగివచ్చి హాస్టల్ చేరుకున్న అనూరాధ తనకేమైనా ఉత్తరాలొచ్చాయేమోనని షెల్ఫ్ దగ్గరకు వెళ్ళి వెతకనారంభించింది.

ఉత్తరాలు లేవు. కాని వారపత్రిక మాత్రం తన పేర వచ్చింది. తనకెవరు పంపారా అని ఆతృతగా చిరునామా వైపు చూసింది.

అది భర్త శేఖరం పంపినదే. "ఏమిటో విశేషం" అంటు రేపర్ చించింది. హాస్టల్ మేడమెట్లు ఎక్కుతూ. పత్రిక తిరగవెయ్యగానే లోపలినుంచి ఉత్తరం క్రిందపడింది. పైగా దానిమీద పెద్ద అక్షరాలతో. "రాధకి ముద్దులతో అని వ్రాసి ఉంది.

అనూరాధకి ఒక్కసారి ఒళ్ళు జల్లుమంది. ఎవరూ చూడటం లేదు కదా అని అటూ ఇటు పరికించి చూసింది. ఎవరూ లేరని ధైర్యంకలగ్గానే ఉత్తరాన్ని తీసి నిజంగానే ముద్దు పెట్టుకొంది. అమ్మదొంగా ఎంతఏడిపించారు అని అనుకొని తన గదివయిపు నడిచింది

అప్పటికేరూమ్‌మేటు స్వాతిమంచం మీద పడుకుని వుంది.

అనూరాధ పత్రికను బల్లమీదపడేసి భర్త ఉత్తరాన్ని ఆతృతగా చదవనారంభించింది.

అనూ!

చాలారోజుల తరువాత కధ వ్రాయాలని బుద్ధి పుట్టింది. అంతకంటే నువ్వు లేని నా వంటరితనమే నన్నుకధ వ్రాయమని ప్రోత్సహించింది. నీకెలా ఉందో కాని నాకు నువ్వులేని ఈ నెల్లాళ్ళు కొన్ని యుగాలు గడిచినట్లుగా వుంది. "ఇంక రెండేళ్ళు ఇలాగే గడపాలా" అని ఆలోచన వచ్చినప్పుడు నిజంగా పిచ్చివాడ్నయిపోతున్నాను నువ్వునన్ను పదేపదే కధలు వ్రాయమని అడిగావు నీకు చాలాసార్లు చెప్పాను. ఆనాడు

పెళ్ళిచూపులకు వచ్చినప్పుడు నేను కథలు వ్రాస్తానని. తెల్పుకొన్న నీ కళ్ళ లోని ఆ ఆనందం నేనెప్పటికీ మరువ లేనని. నన్నేం చెయ్యమంటావు అనూ నీ కళ్ళలోకి చూస్తూ యుగాలు గడిపే అపూర్వశక్తిని భగవంతుడు నీ కళ్ళకు ప్రసాదించాడు. నీవు దగ్గర వున్నంత వరకూ నేనేపనీ చెయ్యలేకపోయాను. ఇవాళ ఆఖరిసారిగా శక్తిని పుంజుకొని కథను వ్రాసాను. నా కథ ప్రచురిత మైంది. నాకు వచ్చిన కాపీ నీకు పంపు తున్నాను, చదివి ఎలాగున్నదీ నాకు వ్రాయి. అనుమతిస్తావనే ఉద్దేశంతో ఈ కథ నీ పేరుతో వ్రాసాను,

ఇట్లు
నీ శేఖరం

పి ఎస్ అన్నట్లు మరిచాను అనూ ఎల్లుండి నేను ఆఫీసుపనిమీద అక్క డకు వస్తున్నాను. హోటల్ మనోరమలో బస చేస్తాను, ఏరోడ్రోముకి తప్పకుండా రావాలి సుమా। నాకు తెల్పు ఈ ఉత్త రం చదివిన తర్వాత నీ మనస్సెలా వుంటుందని.

అందుకే నేనక్కడికి చేరే నాటికి ఈ ఉత్తరం అందేలా పోస్టు చేశాను.

అనూరాధకి ఆనందంతో కూడిన కోపం వచ్చేసింది. ఇలాంటి ఉత్తరాన్ని అలాగా పంపటంరానీ చెబుతాను అను కొంది,

అనూరాధ కళ్ళు ఆతృతగా పత్రిక వైపు మళ్ళాయి. అప్పటికే పత్రిక స్వాతి చేతుల్లోకి వెళ్ళిపోయింది.

"స్వాతీ ఒక్కసారి ఆ పత్రిక ఇయ్యవే మళ్ళీ ఐదు నిముషాలలో ఇచ్చేస్తాను" అందిఅనూరాధ.

"ఏమిటమ్మా అంత తొందర"పక్క మీద నుంచి లేచి పత్రిక వెనక వేపు ఉంచుకొని అనూరాధ దగ్గరకు వచ్చి అడిగింది స్వాతి "ఇప్పటివరకు అంత సీరియస్‌గా చదువుతున్న ఆ ఉత్తరం కంటే ఈ పత్రిక ముఖ్యమా?అవునుగాని ఏమిటీ కథ"

అనూరాధ చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి. మాట మార్చాలని చూసింది. అది తన వల్ల కాలేదు.

"ఏమీలేదే మనకి ఒక అతిథి వస్తు న్నారు, గబగబా తయారై, ఇప్పుడే బయటకు వెళ్ళాలి" అంది అనూరాధ బాత్‌రూం వేపు దారితీస్తూ.

అసంపూర్తిగా వున్న అనూరాధ సమాధానం అర్థంకాక తిరిగి పత్రికచదవ డంతో మునిగిపోయింది స్వాతి.

ఆ కథలో సమన్వయిఅనే అమ్మాయి రాజా అనే అబ్బాయిని ప్రేమిస్తుంది. ఇద్దరూ ఒకే క్లాసులో చదువుతూ వుంటారు.

రాజా మంచిస్ఫురద్రూపి, అతనిలో ఏదో చెప్పలేని ఆకర్షణ శక్తి వుంది. అటువంటి ప్రత్యేకత వున్న రాజా సమన్వయిని ఆకర్షించాడు. అందరి తోను కలిసి విడిగా వుండటం సమన్వ యికి నచ్చదు. అలావుండవద్దని చెప్పే ధైర్యం ఆమెకు లేదు. కాని రాజా మనసు మాత్రం సమన్వయికే అంకిత

మవుతుంది. సెలవలకు వెళ్ళిన రాజా తల్లితండ్రుల్ని పెళ్ళికి ఒప్పిస్తాడు. ఆ విషయాన్ని సమన్వయికి చెబుదామని ఆతృతతో వస్తాడు. కాని సమన్వయిలో చెప్పలేని మార్పు వస్తుంది. రాజా ఎంత ప్రయత్నించినా మాట్లాడదు. ఎందుకు సమన్వయి ఇలా మారిపోయిందో తెల్సుకుందామన్నా ఆమె మాట్లాడటానికి ఆస్కారమివ్వదు రాజా మనసు దెబ్బ తింటుంది. వికల మనస్కుడయిన రాజా చదువు మానివేస్తాడు. ఆతరువాత సమన్వయి పెళ్ళి మరొక వ్యక్తితో జరిగిపోతుంది. కాని ఆమె జీవితం పువ్వుల పాలవుతుంది. కట్టుకొన్న భర్త ఆమెను నిరాకరిస్తాడు. కాలం కాటు వేస్తుంది. భర్తకు విడాకులిచ్చి సమన్వయి స్కూలు టీచరుగా ఉద్యోగం చేస్తుంది. ఒకనాడు అనుకోని పరిస్థితులలో సమన్వయి రాజానుకల్సుకొంటుంది. రాజా వున్న ఆస్తిని పదింతలు చేసుకొని బ్రతుకుతూ వుంటాడు. అయినా అతనిలో సమన్వయి మీద ప్రేమ నశించదు.

అప్పటివరకు పెళ్ళి చేసుకోకుండా తనకొరకు వేచియున్న రాజాను చూసి సమన్వయి అతని మనసును అర్థంచేసు చేసుకొంటుంది. రాజాకూడా ఆమె పరిస్థితిని అర్థము చేసుకొంటాడు.సమన్వయిని తనభార్యగా స్వీకరించడానికి ముందుకు వస్తాడు కానీ సమన్వయి హఠాత్తుగా వూరువిడిచి వెళ్ళిపోతుంది. ఆమెకోసం ఆజన్మాంతం అన్వేషణకై పూనుకుంటాడు రాజు.

* * *

తూర్పువైపు కిటికీలోనుంచి చల్లగాలి స్వాతి నుదుటిపైన ముంగురుల్ని వింతగా నాట్యమాడిస్తుంది కథ చదువుతున్నంతసేపు స్వాతికళ్ళల్లో నీళ్ళు నిలిచాయి!

చక్రభ్రమణాన్ని పరిసమాప్తిగావించి తిరిగి శూన్యంలోకిఅంతర్లీనమైపోతున్న సూర్యభగవానుని ఎర్రటినీడలు స్వాతి ముఖంలోని రంగుల్ని మార్చివేస్తున్నాయి స్వాతిభారంగా కళ్ళుమూసుకుంది.

"ఏయ్ ఏమిటేఅది?ఇంద కనగాబయటకు వెళ్ళాలనిచెబితే ఇంకా అలాగే కూర్చున్నావ్"అంది అనూరాధస్నానము చేసి బయటకువస్తూ।

"నేను రావాలటే? నువ్వు వెళ్ళవచ్చేయకూడదూ"అంది స్వాతి

"ఛ, నువ్వూ, నీసిగ్గూనూ. అసలు సంగతి చెపుతాను ఇలారా" అంది అనూరాధ-

స్వాతి భారంగా అనూరాధ దగ్గరకు వచ్చి "వూఁచెప్పు" అంది.

"ఆదేనే ఎలాచెప్పాలో తెలియటము లేదు- ఆయన ఇవాళేవస్తున్నారు. మనం ఇప్పుడే ఏరోడ్రోమ్‌కి వెళ్ళాలి- పద ఇంకా టైమ్‌లేదు"అని తొందర చేసింది అనూరాధ!

"సరిపోయింది ఇంకాఏమిటో అనుకున్నాను. అయినా ఇదెక్కడగొడవే,మీ

ఇద్దరిమధ్య పానకములో పుడకలానేనెం దుకు!" అంది స్వాతి-

"అదికాదే! చూసావా ఇప్పుడే చీకటి పడిపోయింది, అంతదూరం ఒంటరిగా వెళ్ళాలంటేచచ్చేంతభయం ప్లీజ్ నువ్వు రావే" అంది ప్రార్థనా పూర్వకంగా!

'సరే!'అని లేచింది స్వాతి

స్వాతి ముఖం కడుక్కునివచ్చేసరికి అనురాధ కాలుకాలిన పిల్లిలా పచార్లు చేస్తుంది గదిలో.

అనూరాధ హడావిడిచూసి స్వాతిచిరు నవ్వు నవ్వుకొంది-

అనూరాధ, స్వాతీ బయలుదేరేసరికి బాగాచీకటి పడింది. ఇద్దరూ టాక్సీలో ఏరోడ్రోమ్‌కి వెళ్ళారు.

స్వాతి అనూరాధ ముఖంలోకి చూసి నది. ఆమె ముఖంలోని అందము ద్విగు ణీకృతమైంది. ఆమెమనసు తియ్యటి కల ల్లో నిమగ్నమయిందని గ్రహించినది.

"రాధా! ఇవాళపత్రికలో ఒక మంచి కథచదివానే అదిఎంత బాగుందోతెల్సా" అంది స్వాతి.

"నాకేం తెల్సూ"అంది ఎక్కడో ఆలో చిస్తు అనూరాధ-

"యేమిటే ఆ పరధ్యానం? నేనడిగి నది అసలు నీకర్థమైందా"అంటూ అడి గింది స్వాతి.

"ఏమిటడిగావ్?" తిరిగి ప్రశ్నించి నది అనూరాధ,

"కథే, కథ"

"ఓ అదా? అన్నట్టు మరిచానే స్వాతి కథఅంటే జ్ఞాపకమొచ్చింది. ఆయన రచించిన "అన్వేషణ"కథ ప్రచురితమైం దట. ఈహడావుడిలో నీతో చెప్పటము, నేను చదవటం మరచాను"అంది అనూ రాధ-

స్వాతిగుండె కలుక్కుమంది. "ఐతే ఆకథ మీవారు వ్రాశాగన్నమాట?"

"ఏమే కథబాగుందా? కొంచెంచెప్పవే ఆయన కథచదివి నా ఉద్దేశాన్ని చెప్పమ న్నారేఅందిఅనూరాధ స్వాతిముఖంలోకి చూస్తూ.

"కథ తర్వాత అటుచూడు- ఏరో డ్రోమ్‌కు వచ్చేసాము" అంధి స్వాతి

టాక్సీ పోర్టికోలో ఆగింది

అనురాధ టాక్సీకిడబ్బులిచ్చేసిలాంజ్ లోకి దారితీసింది- స్వాతి యాంత్రిక ముగా అనూరాధను అనుసరించినది.

అప్పటికే ప్లేనువచ్చేసింది, ప్రయా ణికులు బయటకు వచ్చేస్తున్నారు-

శేఖరం అనూరాధను దూరంనుంచే చూసి చెయ్యూపాడు.

అనూరాధ స్వాతి చెయ్యిపట్టుకొని శేఖరంపైపు గబగబా నడిచింది!

శేఖరం అనూరాధ చేతినిమృదువుగా స్పృశించాడు. కాని ప్రక్కనున్న స్వా తిని చూసి చటుక్కున వదిలేశాడు.

అనురాధ స్వాతిని శేఖరానికి పరిచ యం చేసింది స్వాతి. వినయపూర్వ కంగా నమస్కరించింది శేఖరం ప్రతి నమస్కారం చేసాడు. "సార్ కారు రెడీగా ఉందండి" అన్నాడు డ్రైవర్ యూనిఫారమ్ సరిచేసుకొంటూ "ఓకే లెటజ్ మూవ్" అన్నాడు శేఖరం.

ముగ్గురూ కలసి మనోరమ హోటలుకి వెళ్ళి భోజనంచేసి, వ్యాన్‌లో కూర్చున్నారు

చల్లటి వెన్నెల, ఆముగ్గురు మనసుల లోను ఏదో చెప్పలేని ఆనందాన్ని కలిగిస్తోంది శేఖరమే మొదలుపెట్టాడు స్వాతినుద్దేశించి

"ఏమండీ మీ హాబీ ఏమిటి?

ఏమున్నాయండి ప్రొద్దుటి నుంచి సాయంత్రం వరకు యూనివర్శిటీ తరువాత కాస్సేపు అలా తిరిగి మళ్ళీ చదవటం, తీరిక సమయాల్లో సినిమాలు చూస్తాను శలవుల్లో ఇంటిదగ్గర ఉన్నపుడు కథలుచదువుతాను" అంది బిడియపడుతూ స్వాతి.

"గుడ్ అలాగఉండాలండి చూడండి మా అనురాధను మరీపుస్తకం పురుగంటే నమ్మండి అన్నాడు శేఖరం అనురాధకేసి ఓరచూపు చూస్తూ.

"అదుగో, ఆ మాటే అనొద్దన్నాను" చూడవే నన్నెలాగా ఏడిపిస్తున్నారో నాకు చదువు వద్దు మొర్రో అంటే వినకుండా యూనివర్శిటీలో చేర్పించారు. తీరా చేరినతరువాత ఇదీవరస అనిబుంగమూతి పెట్టింది అనురాధ

అబ్బా అలాగా, మీరే చెప్పండి స్వాతి. వంటపేరుచెప్పి నన్ను నానా హింసలుపెడితేనన్నేం చెయిమంటారు అని అనురాధకేసి తిరిగి అన్నాడు. "అయితే రాధా ఇప్పుడుమానెయ్యమంటున్నాను మానెయ్యి"

అలాగా, మానెయ్యమనడానికి చదవమనడానికి మీ ఇష్టమేనేమిటి? చేర్పించేవరకే మీవంతు. ఆ హోటల్‌వాడు మీకు పెడతాడు పంచభక్ష్యపరమాన్నాలు.ఇంక నేనెందుకు అంది అనురాధచిరుకోపాన్ని ప్రదర్శిస్తూ.

ఒక పెద్ద వ్యాపారసంస్థ అధిపతి ఇంత చిలిపిగా, ఓర్పుగా, భార్యతోప్రవర్తించటం స్వాతికి ఏదోచెప్పలేనితృప్తి నిచ్చింది స్వాతి అనురాధ నుద్దేశించి అంది" నువ్వు దొరికిపోయావులే, ఇంక మాట్లాడకు" అయితే మీరిద్దరూ కలిసి నన్నేడిపిస్తున్నారన్నమాట అంది అనురాధ

శేఖరం వాచీ చూసాడు.దగ్గర దగ్గర పదకొండు కావస్తుంది రాధా టైమెంతైందో తెల్సా అన్నాడు శేఖరం

అవునవును మళ్ళీ వార్డన్ లోపలికి రానియ్యడు రావే పోదాం అంది అనురాధ స్వాతినుద్దేశించి

నువ్వొక్కడికే, నేను నెమ్మదిగా వెళతానులే అంది స్వాతి

శేఖరం శృతికలిపాడు అవును రాధా ఈరెండురోజులు శెలవుపెట్టి ఇక్కడే ఉండిపోకూడదూ

మీరెందుకొచ్చారండి ఇక్కడికి, ఆఫీసు పనిమీదా, లేక నన్ను చూడటానికా.

రెండింటికీనూ సమాధానమిచ్చాడు శేఖరం

శేఖరం అలా స్వాతిముందు తనను ఉండమని అర్ధించడంతో, అనురాధ కొంచెం సిగ్గుపడింది

అల్‌రైట్, పదముందు మీహాస్టల్‌కి స్వాతిని దిగబెడదాము. అని శేఖరం లేచాడు.

అనురాధ ముందుసీటులో కూర్చుంది శేఖరం కారు డ్రైవ్ చేస్తున్నాడు

ఉన్నట్టుండి శేఖరం అడిగాడు" రాధా నా కధ చదివావా?

అనూరాధకు ఏమని సమాధానం చెప్పాలో తెలియలేదు లేదంటే అతను ఎక్కడ బాధపడతాడోనని "స్వాతి చదువుతూ ఉంటే నేను విన్నాను"

ఓ అలాగా" అయితే నిన్నడిగితే ప్రయోజనంలేదు "ఏమండీ స్వాతి మీ ఉద్దేశ్యం" అన్నాడు.

"చాలా బాగుందండీ, వాస్తవికతను బాగా చిత్రీకరించారు" అంది క్లుప్తంగా.

నిజం చెప్పాలంటే, ఈకధ వ్రాయ టానికి, రాధ ప్రోద్బలమే కారణమండీ అన్నాడు తృప్తిగా. "బాగుందండీ మీ వరుస, ఇక్కడనేను దూరంగా చదువు కొంటూఉంటే" నేను ఎప్పుడుమిమ్మల్ని అంతఇబ్బందిపడి కధలు వ్రాయమన్నా నండీ అందుకుంది అనూరాధ.

చూశారా అండి, సంతోషించవలసి నదిపోయి అప్పుడే తన్నేదో అన్నట్టు బాధపడిపోతుంది అన్నాడుశేఖరం స్వాతి నుద్దేశించి. తిరిగిఅన్నాడు రాధని ఉద్దే "శించి" రాధా నీలోని ఈ అమాయకతే నాశకి!

వారిద్దరి సంభాషణల్ని వింటున్న స్వాతి. ఒకప్రక్క అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవిస్తున్నా తన పరిస్థితి అడకత్తెరలో చెక్క లాగయిందనే వాపోయింది.

కారు హాస్టల్‌దగ్గర ఆగింది.

స్వాతీ అనూరాధా ఇద్దరూదిగారు.

"ఏయ్ నువ్వొక్కడికి" అన్నాడు శేఖరం అనూరాధ చెయ్యి పట్టుకొని

"ఛ" అదేమిటండీ మరీ సిగ్గులేకుండా ప్రక్కన స్వాతి ఉందని ఏమయినా తెలుస్తోందాలేదా అంట: ఇదేమయినా అమ్మాయిల హాస్టలనుకున్నారా లేక సినీమా హాలనుకున్నారా "అవును గాని" ఏమిటా విపరీతం నేను నాబట్టలు తెచ్చుకోవాలా, అక్కర్లేదా!! అంది గోముగా "అయామ్‌సారీ" ఊతొందరగా కానియ్యి అన్నాడు శేఖరం.

ఇంతలోనే స్వాతి అనురాధ బ్యాగుతో కావలసిన బట్టలు సర్దితీసుకొచ్చింది.

"అదేమిటే" ఇంక హాస్టల్లోకి నన్ను రావద్దనా అంది అనూరాధ స్వాతికేసి చూస్తూ

"పోవోయ్ పెద్ద ఇప్పుడు ఇక్కడ ఉండి చదివేవానిలా పోజులిస్తున్నావు. చూడండి శేఖరంగారూ ఇదిఉత్తమొద్దండీ ఏమీ చదవదుఅంది స్వాతి మరింత ఉడుకెత్తిస్తూ.

"హారి పిడుగా" నువ్వూ ఆయన పార్టీలో చేరిపోయావా, కానీయండి "నాఖర్మ" అంది కారులో కూర్చుంటూ-

శేఖరంవున్న రెండురోజులు స్వాతికీ అనూరాధకు తీరుబడే లేకపోయింది. ఒకరోజున సింహాచలం, వంశధారా. మొదలయిన ప్రదేశాలు చూశారు

మర్నాడు, వరసగా రెండు సినిమాలు చూశారు.

ఆరెండురోజులూ హాయిగా గడిచి పోయాయి. స్వాతి వారి దాంపత్యానికి ఎంతోసంతోషించింది. దేవుడు వాళ్ళని చల్లగా చూడాలని మనసు పూర్వకంగా ప్రార్థించింది.

మూడవరోజున శేఖర్ వెళ్ళిపోతు న్నాడంటే, అనూరాధకంటే స్వాతే ఎక్కువ బాధపడిపోయింది.

స్వాతి, అనూరాధ, శేఖరంముగ్గురూ వెనకసీట్లో కూర్చున్నారు. డ్రైవరుకారు స్టార్ట్ చేశారు.

"రాధా ఇంతకు కథగురించి నీ అభి ప్రాయము చెప్పలేదు" అన్నాడుశేఖరం.

అనూరాధ నాలిక్కరుచు కొంది సమాధానంకోసం. స్వాతికేసి దీనంగా చూసింది.

"దానికి తీరుబడెక్కడండీ, శేఖరం గారూ" అంది నవ్వుతూ.

శేఖరం నవ్వేశాడు.

కారు ఏరోడ్రామ్ చేరుకుంది.

రాధా వెళతాను. వుత్తరాలు వ్రాస్తూ వుండు.

"యేమండీ ఈరెండురోజులు మా వల్ల మీచదువుకు ఆటంకము కలిగిందను కొంటాను" అన్నాడు స్వాతికేసితిరిగి.

"అదేమీలేదండీ ఈ రెండు రోజులు ఇంతసరదాగా గడిచిపోయాయి. ఇక మీదట ఎలాగడపడమోఅని ఆలోచిస్తు న్నాను" ఎమంటావే రాధా అందిస్వాతి.

శేఖరం వెళ్ళిపోయాడు.

* * *

ఏరోడ్రామునుంచితిరిగివచ్చిన అనూ రాధ కథ చదవటం మొదలుపెట్టింది.

కథ చదువుతున్న అనూరాధా ముఖం లోనికి గుచ్చిగుచ్చి చూస్తూ ఆమెలోని మార్పిడిని చదవటానికి ప్రయత్నిస్తోంది స్వాతి తనప్రక్కమీద మంచి.

అనూరాధ కథ చదవటల ముగించి బద్ధకించి ఆవలించి. ప్రక్కమీదకు ఒరిగిపోయింది. అనూరాధలో ఏవిధ మైన ప్రత్యేకత లేకపోవటం చూసి, స్వాతి ఆశ్చర్యపోయింది.

ఊరుకోలేక అంది. "రాధా, కథ చదవటమైందా: "నీ అభిప్రాయం?"

"ఏముందీ ఈ కథలో నాకేమీక్రొత్త దనం కనిపించలేదు. ఇది నాకు తెలిసిన సమస్యే" అని తేల్చిపారేసింది.

స్వాతిలో ఆత్రుత మరింత హెచ్చింది. అనూరాధను ఏమిటేమిటో అడగాలని అనుకొంది, కాని, రెట్టించి అడిగితే అనూరాధ ఏమనుకొంటుందో నని భయపడి అంతటితో ఆపివేసింది.

* * *

శేఖరం ఇంటికి చేరేసరికి ఉత్త రాలు చాలా పడిఉన్నాయి. ఒకొక్కటే చదవసాగాడు. ఆఖరి ఉత్తరాన్ని విప్పాడు:

శేఖరంగారూ,

మీలాంటి రచయితను కలుసుకోవటం నా భాగ్యంగా భావిస్తాను, మీ కలుపు గోలుతనం, మీ మాటల్లోని మృదుత్వం నాకీ ఉత్తరాన్ని వ్రాయటానికి తగిన

శక్తిని, ధైర్యాన్నీ ఇచ్చాయి. మిమ్మల్ని భర్తగా పొందిన అనూరాధ నిజంగా అదృష్టవంతురాలు. మీ ఇద్దరి మధ్యన ఆ అనురాగం, ఆప్యాయత కలకాలం నిల్చిపోవాలని భగవంతుణ్ణి మనఃపూర్వకంగా ప్రార్థిస్తున్నాను. మీరు వ్రాసిన కథగురించి అభిప్రాయాన్ని ఇమ్మన్నారు. నాకుమీ ముఖాముఖీనమాట్లాడేందుకు ధైర్యం లేకపోయింది. అందుకే ధైర్యంగా మీకీ ఉత్తరాన్ని వ్రాస్తున్నాను,

నేను మీ కథలోని సమన్వయవ్యక్తి లాంటి స్త్రీనే చూశాను, నిజంగా ఆమె ఎవ్వరోగాదు, మా అక్కయ్య, అక్కయ్య పేరు "కవిత" అక్కయ్య మనస్తత్వం చిన్నప్పటినుంచీ అదో తరహా! ప్రతీదానికీ తనమాటే చెల్లాలనేది దాని పట్టుదల, దాని మొండిపట్టుదలకి అమ్మా నాన్నా చాలా బాధపడేవారు, అక్కయ్య వయస్సుతోబాటు పెరిగింది. కానిదానితత్వంమారలేదు, పై చదువులకోసమని విశాఖపట్నం వెళ్ళింది, మొదటి సంపత్సరం సాఫీగానే గడిచిపోయింది. ఫైనలియర్‌లో మాత్రం అక్కయ్యలో ఏదో మార్పు వచ్చింది, నేను పసిగట్టాను, ఏమటని ప్రశ్నించాను అక్కయ్య చిన్నపిల్లలా ఏడ్చేసింది, నే. కారణం చెప్పమని కోరాను. అప్పుడు అక్కయ్య చెప్పింది. తాను ఒకవ్యక్తిని ప్రేమించానని అందుకు అతనూ సమ్మతించాడని, ఇద్దరూ పెళ్ళి చేసుకొందుకు నిర్ణయించుకొన్నారట కూడాను - కాని అక్కయ్య అంది ఆమె ప్రేమించిన వ్యక్తి పెళ్ళి సుమిత్ర అనే తనక్లాసులో



ఉన్న అమ్మాయితో నిర్ణయమైనట్లు తెల్పిందని చెప్పింది అక్కయ్యకు మొదటినుంచి తొందర ఎక్కువ. నిజం తెల్సుకోకుండా ఆయన్ను అపార్థం చేసుకొని మాట్లాడటం మానివేసింది, అక్కయ్యనాతో ఈ విషయం చెప్పినప్పుడు, అక్కయ్య వెర్రితనానికి నేను ఎంతైనా బాధపడ్డాను. ఆమాటే అక్కయ్యతో చెప్పాను. మన ప్రక్కన స్వార్థపరులుంటారనీ. పచ్చటి సంసారాల్ని పాడుచేసే ప్రముఖులు గోరంత విషయాల్ని కొండంతలుగా చెబుతారని, కాబట్టి, ఊహాత్మకమైన ఆలోచనలకు ఆస్కారమివ్వవద్దని హెచ్చరించాను. ఆ వ్యక్తిని కల్సుకుని ముఖాముఖీగా అసలు విషయాన్ని తెల్సుకోమని అర్థించాను. కాని అక్కయ్య నామాట వినలేదు. పైగా సుమిత్రే తనకావిషయాన్ని చెప్పినట్లుగా చెప్పింది.

అక్కయ్య పెళ్ళి, శ్రీపతితో జరిగిపోయింది ఆ పెళ్ళిలో, అక్కయ్య ముఖంలో, పెళ్ళికళకంటే ఏదో ప్రతీకారచర్యే నాకు కనిపించింది. శ్రీపతి బావ అందమైనవాడే. కాని అతనికి వివేకంలేదు. అతను చెడునడతలు నడిచేవాడు. అక్కయ్య ఏ పరిస్థితుల్లోంచి అవివేకంగా తప్పుకుందామనుకుందో ఆ ప్రవాహంలోకే కొట్టుకొనిపోయింది. ఆత్మశాంతి కోల్పోయిన అక్కయ్య, విరాగినిఅయింది. బావకు విడాకులిచ్చింది. ఆ తరువాత సంఘంలో తలఎత్తుకొని బ్రతకలేక ఆత్మహత్యచేసుకొంది.

మీరు వ్రాసిన అన్వేషణ కథ చదివిన తరువాత నాకు ఏడుపువచ్చినంత పనైంది. ఒకవేళ అక్కయ్యను ప్రేమించేవ్యక్తి మీరేనేమోనని అనుమానం వచ్చింది. వ్యక్తి మీరే ఐతే అక్కయ్యచేసిన పొరపాటుకు ఆమెకు తగినశిక్ష భగవంతుడే విధించాడు. దుఃఖపూర్వకంగా చెప్పాలంటే, మీరే అక్కయ్యను పెళ్ళిచేసుకొన్నట్లయితే, ఈనాడు అనూరాధనుంచి మీరు పొందే సంతృప్తిని పొందిఉండేవారు కాదేమో, అనూరాధే నిజమైన అక్కయ్య ఐతే నేనెంత అదృష్టవంతురాలనై ఉందునో.

ఇలాంటి ఉత్తరాలు ఆత్మీయుల మధ్య అనుబంధాల్ని సుళువుగా తెంచివేస్తాయి. రాధఅక్కయ్య చూసిందంటే నన్ను అసహ్యించుకోవచ్చును, కాబట్టి నన్ను మన్నించి దీన్ని చింపివేస్తారని ఆశిస్తున్నాను.

పరిశలవు

ఇట్లు

స్వాతి

ఉత్తరం చదవటం ముగించిన శేఖరం మనసు బాధగా మూల్గింది.

ఉత్తరం చించిపారేసి, సిగరెట్టు వెలిగించి అనుకొన్నాడు "అన్నయ్య అన్వేషణకు ముగింపులేదని"

★